కథ

# గుడి గంటలు

గన్నవరపు నరసింహమూర్తి

ఈ రోజు నుంచే ధనుర్మాసం ప్రారంభమైంది. ఊళ్ళో అప్పుడే సంక్రాంతి సందడి ప్రారంభమైంది! ఆరోజు శనివారం కావడంతో ప్రత్యూషపు వేళ ఏటికి వెళ్లి మడిగా నీళ్ళు తెచ్చాను. ఆ తరువాత నా పూజాదులు ముగిసేసరికి పదిగంటలైంది. ఎందుకో ఎప్పుడూ ఉదయాన్నే వచ్చే పనిమనిషి ఆరోజు ఆలస్యం చేసింది. ఇంక ఆ పనులు కూడా నేనే చేయవలసి రావడంతో బాగా అలసిపోయాను. ఈలోగా మావారు స్నానం చేసి, పూజలో కూర్చోవడం జరిగిపోయింది. కాసేపు విశ్రమిద్దామని గుమ్మంలోని కొబ్బరిచెట్టు క్రింద మంచంమీద నడుం వాల్చాను.

అప్పుడే నేను ఈ ఇంటికోడలిగా అడుగు పెట్టి పాతిక సంవత్సరాలు పూర్తయ్యాయి. మా అత్తవారిది కూడా ఈ ఊరేకావడంతో పుట్టిన దగ్గర్నుంచీ యిప్పటి దాకా నాజీవితం అంతా ఈ ఊళ్ళోనే గడిచిపోయింది. 'పెళ్లైనా ఈ ఊళ్ళోనేనా? అనీ నా స్నేహితురాలు జానకి పెళ్ళైన కొత్తలో నన్ను ఆటపట్టించింది. ఇంతకీ జానకి ఎవరో చెప్పలేదు కదూ! నా ప్రాణ స్నేహితురాలు. అనుంగు నేస్తం! ఒకటో తరగతి నుంచి డిగ్రీ దాకా కలిసే చదువుకున్నాం.

అదీగాక వాళ్ళది మా పొరుగిల్లే, నాకెందుకో ఇప్పుడు జానకి గుర్తుకురాసాగింది. ఇప్పుడే కాదు ఈ మధ్యన రోజూ గుర్తుకొస్తోంది. అప్పుడే దాన్ని చూసి పదిహేనేళ్ళు అవుతోంది! పదిహేనేళ్లక్రితం వాళ్ళ నాన్నగారు చనిపోయినప్పుడు చివరిసారిగా ఈ ఊరొచ్చింది. అప్పుడు వాళ్ళ నాన్నగారి అంత్యక్రియలు పూర్తవగానే వాళ్ళ అమ్మని తీసుకొని మళ్లీ అమెరికా వెళ్ళిపోయింది. ఆ తరువాత మళ్ళా రాలేదు.

రెండేళ్ళ క్రితం మా పిల్లలిద్దరికీ పెళ్ళిళ్లై వెళ్లి పోవడంతో నన్ను ఒంటరితనం బాధిస్తోంది. అందుకే ఈ మధ్య జానకి తరచు గుర్తుకొస్తోంది. ఇలా ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్న నాకు "అమ్మా ఉత్తరం" అన్న పోస్ట్‌మాన్ మాటలకు తెలివొచ్చింది. వెంటనే లేచి ఆ ఉత్తరాన్ని అందుకున్నాను. ఆ ఉత్తరాన్ని చూడగానే అది విదేశాలనుంచి వచ్చిందని అర్థమైంది. నాకు విదేశాల నుంచి ఉత్తరం ఎవరు రాసేరు చెప్మా అంటూ దాన్ని చదవడం మొదలుపెట్టాను.

ప్రియమైన అత్తయ్యకు,

శ్రీహర్ష నమస్కరించి వ్రాయునది. ఇంతకీ నేనెవరో గుర్తుపట్టారా?! మీ ప్రాణ స్నేహితురాలు, చిన్ననాటి నేస్తం జానకి కొడుకుని. నేను ఇక్కడే యింజనీరింగ్ పూర్తిచేసి ఒక కంపెనీలో పనిచేస్తున్నాను.

ఇక అసలు విషయం! నేనూ అమ్మా కలిసి పదిరోజుల్లో మన ఊరు వస్తున్నాము. మీకు తెలుసో లేదో కానీ మా అమ్మమ్మ చనిపోయి రెండేళ్లయ్యింది. అదే సంవత్సరం మా నాన్నగారు కూడా దురదృష్టవశాత్తూ ఒక కారు ప్రమాదంలో చనిపోయారు. ఒకే సంవత్సరం వాళ్ళిద్దరూ హఠాత్తుగా చనిపోవడంతో మా అమ్మ తట్టుకోలేక పోయింది! అప్పట్నుంచీ ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఎన్నో మందులు వాడిన తరువాత ఆమె కోలుకుంది. కానీ పూర్వపు చలాకీతనం లోపించింది. పూర్తిగా మౌనం దాల్చింది. అప్పటి మా అమ్మకి ఇప్పటి అమ్మకీ చాలా తేడా కనిపిస్తోంది.

అప్పట్లో మా యింటికి రోజూ మన తెలుగు వాళ్లు అమ్మకోసం వస్తూండేవాళ్ళు! మా అమ్మ పాటలు చాలా బాగా పాడేది! ప్రతీరోజు ఇక్కడ ఉన్న వేంకటేశ్వరుని గుడిలో తెల్లవారుజామున సుప్రభాతం పాడేది. మా అమ్మతో పాటు నేను కూడా గుడికి రోజూ వెళ్ళి అమ్మ పాటలు వింటూ మైమరచిపోతూండేవాణ్ణి, ఇక్కడ ఏ తెలుగు వాళ్ళింట్లో ఏ కార్యక్రమాలు జరిగినా మా అమ్మ చేసే సందడి అంతా ఇంతా కాదు.

అటువంటి మా అమ్మ ఇప్పుడు మూగనోము పట్టినట్లు ఎవరితోనూ మాట్లాడటం మానేసింది. మళ్ళా ఆమెని మామూలు మనిషిగా చెయ్యాలని ఎందరో డాక్టర్లకు చూపించాను. కానీ అవేమీ సరైన ఫలితాలివ్వలేదు.

మొన్ననే ఒక తెలిసిన తెలుగు డాక్టరు అమ్మని పరీక్షించి మన ఊరు తీసికెళితే ఆ పరిసరాలు, మిమ్మల్నందరినీ చూసి తిరిగి మామూలు మనిషయ్యే అవకాశం ఉందనీ చెప్పడంతో వెంటనే అక్కడికి రావడానికి అన్ని ఏర్పాట్లుచేసాను. మేము రాబోయే ఆదివారం నాడు అక్కడకి చేరుకుంటాము. మేము వచ్చేసరికి మా రైతుకి చెప్పి మాయింటిని శుభ్రం చేసి ఉంచండి. మిగతా విషయాలు వచ్చిన తరువాత మాట్లాడుతాను. మామయ్యగారికి నమస్కారాలు. ఉంటాను.

శ్రీహర్ష

ఆ ఉత్తరం చదవగానే నాకు చెప్పలేని ఆనందం కలిగినా జానకి భర్త చనిపోయిన విషయం మాత్రం తీవ్రమైన బాధ కలిగించింది. ఎందుకో నాకా సమయంలో జానకితో నేను ఈ పల్లెలో గడిపిన బాల్యం గుర్తుకురాసాగింది! అలా అలలు అలలుగా నా జ్ఞాపకాలు నలభై సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయాయి.

× × ×

మాది ఏటి ఒడ్డున ఉండే అందమైన అగ్రహారం! ఏటికి దిబ్బలే మా ఆటస్థలాలు. అదీగాక

జానకి వాళ్ళది మా పొరుగిల్లే కాబట్టి నేనెప్పుడూ వాళ్ళింట్లోనే ఉండేదాన్ని, ఉదయం లేవగానే మేమిద్దరం కలిసి ఏటికి స్నానానికి వెళ్ళేవాళ్ళం!

ఏటినుంచి వస్తున్నప్పుడు దారిలో ఉన్న మునుగోరంట పూలు కోసేవాళ్లం. ఆ పచ్చని పూలతో దండ గుచ్చుకొని స్కూలుకెళ్లినప్పుడు తలలో పెట్టుకునే వాళ్లం.

స్కూలునుంచి వచ్చిన తరువాత మళ్లీ ముఖం కడుక్కుని జానకి వాళ్ళింటికి వెళ్ళేదాన్ని! అప్పటికే వాళ్లిల్లు స్నేహితులతో నిండిపోయి ఉండేది. ఆ సమయంలో జానకి వాళ్ళనాన్న గారు మా అందరికీ సంగీతం నేర్పేవారు. మేమందరం జానకి వాళ్ళ నాన్నగారిని రామం మావయ్యనీ, వాళ్ళమ్మని విమలత్తయ్యనీ పిలిచేవాళ్ళం! మేమందరం సంగీతాన్ని ఏదో తప్పక నేర్చుకున్నా జానకి మాత్రం దాంట్లో పూర్తిగా లీనమైపోయేది.

ఇంక ప్రతిశనివారం తెల్లవారకముందే స్నానం చేసి ఏటి గట్టున ఉండే వేంకటేశ్వరుడి గుడికి వెళ్ళేవాళ్ళం! ఆరోజున రామం మావయ్య అక్కడ సుప్రభాతం పాడేవాడు. జానకి కూడా వాళ్ల నాన్నతో జతకలిపేది. ఆ తరువాత జానకి చాలా పాటలు పాడేది. ముఖ్యంగా అన్నమయ్య కీర్తనలు ఆమె నోటివెంట మధురంగా పలికేది. ఆమె పాడుతూంటే మేమందరం తన్మయత్వంతో వినేవాళ్ళం. కార్తీక మాసాలలో అయితే అక్కడ మరింత సందడిగా ఉండేది. ఒక ప్రక్క ధ్వజస్తంభం ముందు హారతులు కొందరు వెలిగిస్తుంటే మరికొందరు కొబ్బరికాయలు కొడుతూ జానకి పాటలు వింటూ ఉండేవారు.

ఇక సంక్రాంతి వస్తోందంటే సందడే సందడి! నెలగంటు పెట్టిన దగ్గర్నుంచీ ప్రారంభమయ్యేది సంక్రాంతి శోభ. అప్పుడే వరి కంకులు హరిత వర్ణం నుంచి పసుపు పచ్చగా మారుతూ ఒక వింత అందాన్నిస్తుండేవి. నేను, జానకి పొలాలకి వెళ్లి ఆ పండిన వరి కంకుల్ని తెచ్చి యింటి ముందు వ్రేలాడ గట్టేవాళ్లం! సాయంత్రం పూట ఆ పచ్చిధాన్యాన్ని తినడానికి వచ్చే పిచ్చుకల కిచకిచ చప్పుళ్లు వినసొంపుగా ఉండేవి.

ఇక తెలవారకముందే నేను, జానకి స్నానాలు చేసి పోటాపోటీగా వాకిట్లో ముగ్గులు పెట్టేవాళ్లం! ఆ నెలరోజులు రోజుకోరకం ముగ్గు పెట్టేవాళ్ళం! అన్నింటికన్నా నాకు రథం ముగ్గంటే ఎంతో యిష్టం! ఆ ముగ్గులు పెడుతున్నప్పుడే హరిదాసు తుంబురా మీటుకుంటూ వచ్చేవాడు. అతని కోసం మేము బియ్యం గ్లాసులో పోసి ఉంచేవాళ్ళం! బియ్యం అతని పాత్రలో వేస్తున్నప్పుడు ఆ ఆనందంతో మాకు మంచి మొగుళ్ళు రావాలనీ దీవించినపుడు చచ్చేటంత సిగ్గు ముంచుకొచ్చేది. ఇంక ఆ నెల్లాళ్ళు బట్టల వాళ్ళు సైకిళ్ళమీద వచ్చే వాళ్ళు. వాటిని కొనీ కుట్టించేదాకా మాకు మనస్థిమితం ఉండేదికాదు.

ఇక భోగి, సంక్రాంతి రోజుల్లో అయితే మరింత సందడిగా ఉండేది. ప్రతీ యింటికి అల్లుళ్ళతో సహా చాలామంది చుట్టాలు వచ్చేవాళ్ళు. తెలతెలవారుతుండగానే భోగిమంటలు పోటాపోటీగా వేసేవాళ్ళం. ఆ మంటలు ఉవ్వెత్తున ఎగసి పడుతుంటే జానకి చేసే అల్లరికి అంతూ పొంతూ ఉండేది కాదు. ఆ తరువాత వేడివేడి నీళ్ళతో కుంకుడు పుల్లను కలిపి తల స్నానం చేసేవాళ్లం. ఆ తరువాత కొత్త బట్టలు కట్టుకొని ప్రతీయింటికి వెళ్ళి సరదాగా కాలక్షేపం చేసేవాళ్ళం. ఇకమధ్యాహ్న భోజనానికి మమ్మల్ని వెతుక్కోలేక మా అమ్మ ఎంతో ఇబ్బంది పడేది. భోగినాడు సాయంత్రం చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసేవాళ్లు. ఆ పళ్ళను చివర్లో ఎగురవేసినపుడు క్రిందపడే రేగుపళ్లు, చిల్లర డబ్బుల కోసం నేనూ, జానకి పోటీ పడేవాళ్ళం. ఇక సంక్రాంతి నాడయితే తెలవారకముందే లేచి హరికేన్ లాంతరు వెలుగులో పెద్దరథం ముగ్గును పోటాపోటీగా పెట్టేవాళ్ళం. ఆ సాయంత్రం నేను, జానకి, విమలత్తయ్య, మా అమ్మ అందరం కలిసి కుంకుమ పంచేవాళ్ళం. అన్నట్టు మరిచాను; సంక్రాంతినాడు మా అమ్మ చేసే పెరుగు గారెలు మహాయిష్టంగా తినేదాన్ని!

అలా మా బాల్యం ఆనందంగా గడిచిపోయింది. ఈ లోగా మేము పదవ తరగతి పాసవడం, ప్రక్క ఊళ్లో ఇంటర్, డిగ్రీలు పూర్తి చెయ్యడం జరిగిపోయాయి. డిగ్రీ పూర్తవగానే నాకు రఘురాంతో పెళ్ళైపోయింది. నా పెళ్ళైన సంవత్సరం తరువాత జానక్కి కూడా వాళ్ల మేనమావ కొడుకుతో పెళ్ళైపోయింది. అతను యింజనీరింగ్ చదివి, హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవాడు. పెళ్లై అత్తవారింటికి వెళుతున్నప్పుడు వాళ్ళమ్మని పట్టుకొని జానకి ఒకటే ఏడుపు! ఆమె ఒక్కర్తే కూతురు కావడంతో తను వెళ్లిపోతే అమ్మ వంటరిదైపోతుందని ఆమె భయం! ఆమె ఏడుస్తుంటే నాకూ ఏడుపు వచ్చింది. అదీగాక అది ఊరు విడిచి వెళ్ళిపోతోందంటే లోలోపల నాకు విపరీతమైన బాధ కలగసాగింది. ఎందుకంటే చిన్నప్పట్నుంచీ ఒకర్ని విడిచి ఒకరు ఎప్పుడూ ఉండలేదు. ఆమెలేని ఆ ఊరుని నేను ఊహించుకోలేకపోయాను. నిజంగా ఆ రాత్రంతా నేను ఏడుస్తునే ఉన్నాను.

అలా నా జీవితంలోంచి జానకి విడిపోయింది! మరో ఆర్నెల్లు గడిచేసరికి పిడుగులాంటి వార్త తెలిసింది. జానకి వాళ్ళాయనకి అమెరికాలో ఉద్యోగం వచ్చిందనీ, ఆమె కూడా అతనితో అమెరికాకు వెళ్ళిపోతోందని తెలిసి మరింత బాధపడ్డాను. కనీసం అమెరికా వెళ్ళేముందైనా మా ఊరు, మమ్మల్ని చూడటానికి వస్తుందని ఆశపడ్డాను. కానీ సమయంలేక పోవడంతో వాళ్ళమ్మ నాన్నలు విశాఖపట్నం వెళ్ళి ఆమెకి వీడ్కోలు పలికి వచ్చారు. అలా మేము శాశ్వతంగా విడిపోయాము.

జానకి అమెరికా వెళ్ళిన సంవత్సరం దాకా యిద్దరం ఉత్తరాలు రాసుకునేవాళ్లం. ఇక రానురాను నేను సంసారంలో పడి ఉత్తరాలు రాయటం తగ్గించేశాను. ఈ లోగా మాకు ఇద్దరుపిల్లలు వెంట వెంటనే పుట్టడంతో మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు పూర్తిగా తగ్గిపోయాయి!

రెండేళ్ళ తరువాత జానకి వాళ్ళ నాన్నగారు పదవీ విరమణ చేసారు; కానీ దురదృష్టవశాత్తు ఆ సంవత్సరమే తీవ్ర అనారోగ్యం చేసి ఆయన చనిపోయాడు. అప్పుడు వాళ్ళాయన, పిల్లవాడితో కలిసి వచ్చింది జానకి. అప్పుడు ఆ కుటుంబం పుట్టెడుదుఃఖంలో ఉండటంతో ఆమెతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయాను. కానీ ఆమె ఉన్నవారం రోజులు ఆమె వెంటే ఉండి పూర్తిగా ఓదార్చాను. వాళ్ళనాన్నగారి కర్మ కాండలు పూర్తయిన తరువాత జానకి తనతో పాటు వాళ్ళమ్మనీ కూడా తీసికెళ్ళిపోయింది.



**సుందరయ్య విజ్ఞానకేంద్రం (మినీ హాలు)లో డా|| అద్దేపల్లి సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి.ఎస్.ఎం. కుమార్ కవితా సంకలనాన్ని ఆవిష్కరించిన శ్రీ అద్దేపల్లి రామ్మోహనరావు, చిత్రంలో శ్రీ తంగిరాల చక్రవర్తి, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కవి కుమార్, శ్రీ రామకవచం సాగర్, శైలజామిత్ర తదితరులు**

ఆమె వెళ్ళిపోయిన దగ్గర్నుంచి వాళ్లయింటిని మాత్రం నేను జాగ్రత్తగా కాపాడుతూ వస్తున్నాను. ఈ లోగా మా పిల్లలు పెద్దై, చదువులు, పెళ్ళిళ్ళు పూర్తై, వెళ్ళిపోవడంతో ఒంటరితనం నన్ను ఆవహించింది. అందుకే జానకి పదేపదే గుర్తుకు రాసాగింది. అటువంటి సమయంలో వచ్చిన ఆ ఉత్తరం నాకు చాలా ఆనందాన్ని తెచ్చింది. ఆ రోజునుంచి జానకి వచ్చే రోజుకోసం చకోరపక్షిలా ఎదురు చూడసాగేను.

× × ×

అనుకున్నట్టుగానే జానకి కొడుకుతో సహా వారం రోజుల తరువాత వచ్చింది. సుదీర్ఘమైన 15 సంవత్సరాల తర్వాత వచ్చిన ఆమెని చూడగానే నా ఆనందానికి హద్దులు లేవు! ఆమెని ఒక్కసారిగా హత్తుకొని అలాగే ఉండిపోయాను. దాని స్థితి కూడా నాలాగే ఉంది. ఆమెని చూడగానే ఒక్కసారిగా నా వయస్సు ఇరవై సంవత్సరాలు తగ్గిపోయినట్లు అనిపించసాగింది.

కానీ ఎందుకో జానకిముఖంలో ఏదో లోటు కనిపించసాగింది. ఆమెలో చలాకీతనం తగ్గింది. పెళ్ళి నాటికి ఆమెది ముఖం తిప్పుకోలేని ఆనందం!

తెల్లటి మేని ఛాయతో, సన్నగా పొడవైన జడతో అందరి కళ్ళని కట్టిపడేసే సౌందర్యం ఆమెది. అటువంటిది ఇప్పుడామె ముఖంలో కళ లోపించింది. ఆమె కొడుకు శ్రీహర్షది కూడా ఆమె పోలికే! తెల్లగా, బొద్దుగా ఆకర్షణీయంగా ఉన్నాడు. ఆమెని 'అమ్మా! అమ్మా! ' అంటూ ఒక్క క్షణం కూడా వదలిపెట్టటంలేదు వాడు. ఆమె వచ్చిన మధ్యాహ్నం మేము ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ గంటసేపు భోజనం చేశాము.

ఆ సాయంత్రం మేమిద్దరం దానికొడుకుతో కలసి ఏటికి వెళ్ళాం! ఏటిని చూడగానే జానకి ఆనందానికి హద్దులు లేవు! ఒక్కసారిగా పరుగున వెళ్లి ఆ నీట్లో కూర్చుండిపోయింది. ఆ తరువాత ఈ గట్టునుంచి అవతలిగట్టుదాకా ఒకటే పరుగులు అలా పరిగెత్తుతూ అలసిపోయి ఇసుకతెన్ని మీద కూర్చుండిపోయింది.అప్పట్నుంచి చీకటి పడేదాకా మేమిద్దరం ఒకటే కబుర్లు! మా కబుర్లు వింటూ వాళ్ళమ్మ ఒడిలో తలపెట్టుకొని నిద్రపోయాడు శ్రీ హర్ష!

ఆ మర్నాడు నేను, జానకి, శ్రీహర్ష వాళ్ళ పొలానికి వెళ్ళేము. శ్రీహర్షకు అలా పచ్చని చేలను చూడటం మొదటిసారి కాబట్టి చాలా బాగా ఆనందించటం మొదలు పెట్టాడు. నేను, జానకి బోరింగ్ షెడ్డు దగ్గర కుర్చీలు వేయించి అక్కడే కూర్చొని రైతు తెచ్చిన చెరకు ముక్క తింటూ కబుర్లు చెప్పుకుంటుంటే సమయమే తెలియలేదు. మా బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకొని పగలబడి నవ్వుకున్నాము.

జానకివాళ్ళు వచ్చి అప్పుడే నెలరోజులు కావస్తోంది. ఇప్పుడు వాళ్ళు వాళ్ళింటికి వెళ్ళిపోయారు. కానీ రోజూ నన్ను ఒకే ప్రశ్న కలవరపెట్టసాగింది.ఆమె యిక్కడ ఎన్నాళ్లుంటుంది? అది కొన్నాళ్ళుండి మళ్లీ వెళ్లిపోతే నా పరిస్థితి ఏమిటి? మళ్ళీ నన్ను ఒంటరితనం ఆవహిస్తుంది. అది తల్చుకుంటేనే భయం వేయసాగింది. నాకెందుకో జానకి ఎప్పుడూ యిక్కడ ఉండిపోతే బాగుండుననిపించసాగింది.

× × ×

ఆరోజు శనివారం! ఆరోజుకూడా నేను ప్రత్యూషానికి ముందే లేచి ఏటికి వెళ్లాను. ఏట్లో స్నానం చేసి మడిబట్టతో యింటిముఖం పట్టాను. అలా ఏటి గట్టుమీదనుంచి నడిచివస్తుంటే దూరంగా ఆలయంలోని గంటలు మ్రోగసాగాయి. ఆ తరువాత ఒక్కసారిగా నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దం నీరవంలోంచి అలలు అలలుగా మంద్రంగా మలయ మారుతం లాంటి ఒకతీయని స్వరంవినిపించసాగింది.

ముందు శుక్లాంబరధరంతో మొదలైన ఆ తీయటి స్వరం రానురాను అన్నమయ్య కృతిలోకి మళ్ళింది.

'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు' ముందుచిన్న చినుకులా ప్రారంభమైన ఆ కీర్తన క్రమక్రమంగా కుండపోతగా మారసాగింది. ఆ గాత్రంలో ఒక గంభీరత, గొంతులో లాలిత్యం, ఆ పాటలో ఒక వేడికోలు... ఆ పాట అలా వింటుంటే ఆ గొంతు నాకు ఎంతో సుపరిచయమైనదిగా అనిపించసాగింది. నా చిన్నప్పుడు యిదే స్వరం, యిదే గొంతు, యిదేపాట... మళ్లీ యిన్నాళ్ళకు నా చెవులకు విందు చేస్తోంది.

ఆ పాట ఒక ప్రణవనాదంలా నా వీనులకు సోకుతోంది. ఎక్కడా ఆ గొంతులోగాని,మాధుర్యంలో గానీ రవ్వంత తేడాలేదు. అలా ఆ పాట ఆ గుడిలోంచి వస్తుండటంతో నా అడుగులు నాకు తెలియకుండానే అటువైపు పడసాగాయి. ఆ పాట రానురాను దగ్గర కాసాగింది. అది ఆ వేంకటేశ్వరుడి గర్భగుడిలోంచి వస్తోంది. అలా ఆలయంలోకి ప్రవేశించిన నాకు అక్కడి దృశ్యం మనోహరంగా కనిపించసాగింది.

ఆ ఆలయ గర్భగుడిలో స్వామికి ఎదురుగా కూర్చొని మంద్ర స్థాయిలో జానకి గళమెత్తి పాడుతోంది. ఆ మృదు మధుర నాదానికి ఆలయం ప్రతిధ్వనిస్తుంటే ఆ సుప్రభాత సమయం ఒక పవిత్రతని ఆపాదించుకోసాగింది. అప్పుడు ఆమె వెలిగించిన హారతి వెలుగులో గర్భగుడిలోని ఆ భగవానుడు దేదీప్య మానంగా మెరిసిపోతూ కనులకు విందు చేయసాగాడు.

ఆ పాటకు నేపథ్య సంగీతంలా లయబద్ధంగా గుడిగంటలు మ్రోగిస్తూ శ్రీహర్ష కనిపించాడు. అతను కూడా నుదుట బొట్టుతో, పంచె కట్టుకొని ఉన్నాడు. అలా అక్కడ ఎంతసేపు నిలబడ్డానో నాకే తెలియదు.

కాసేపటికి గుడిగంటల శబ్దం ఆగిపోయింది. నన్ను చూసి శ్రీహర్ష మాట్లాడవద్దని సైగ చెయ్యడంతో యిద్దరం ఆలయం బయటకు వచ్చాము. అప్పుడే తెలవారుతుండటంతో ప్రాక్ దిశ సింధూర వర్ణాన్ని సంతరించుకోసాగింది. ఆ లేత భానుడి కిరణాలు శ్రీ హర్ష ముఖంపై పడుతుండటంతో అతని ముఖం స్పష్టంగా కనిపించసాగింది. అతడి కళ్ళల్లో సన్నటి తడి! అతను ఏడుస్తున్నాడు. నేనేమీ వాణ్ణి ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు.

కాసేపటికి వాడు మామూలు మనిషయ్యాడు. కళ్లు తుడుచుకుంటూ చెప్పడం మొదలుపెట్టాడు.

'ఆంటీ! ఒకప్పుడు జలపాతంలా ఉరికే అమ్మా మా నాన్నగారు చనిపోవడంతో ఒక్కసారిగా మూగబోయింది! ఆ ముఖంలో కళపోయింది. ఎప్పుడూ మౌనంగా రోదిస్తుండేది. అటువంటిది యిక్కడికి రాగానే ఆమెలో ఎంతటి మార్పు? మళ్లీ మునుపటి మా అమ్మగుర్తుకు రాసాగింది. అదే నవ్వు! అదే చలాకీతనం! మళ్ళీ మా అమ్మ ముఖంలో యింతటి ఆనందాన్ని నేను చూస్తాననుకోలేదు. ఈ ఊరుని, మిమ్మల్ని చూడగానే మళ్లా మాఅమ్మ తన బాల్యంలోకి వెళ్ళిపోయింది! యిక్కడికి తీసుకొచ్చి నేను చాలా మంచి పని చేసాననిపిస్తోంది! ఈ రోజు మా అమ్మని చూసిన తరువాత ఆమెని ఇక్కడినుంచి యింకెక్కడికీ తీసికెళ్ళ కూడదనిపిస్తోంది! తీసికెళ్ళను కూడా! నిజానికి మా అమ్మ ముఖంలో ఆనందం కన్నా నాకు జీవితంలో ఏవీ ముఖ్యం కాదు ఆంటీ! ఆమెతో పాటు నేను కూడా ఇక్కడే ఉండిపోతాను. ఇంకా మేము అమెరికా వెళ్లే ప్రసక్తేలేదు' గంభీరంగా, స్పష్టంగా అతను చెబుతున్న మాటలు నా వీనులకు అమృతంలా తోచాయి.

వెంటనే వాడి నుదుటన ముద్దుపెట్టుకుని 'ఒరేయ్! బంగారంలాంటి నిన్ను కన్న మీ అమ్మ చాలా అదృష్టవంతురాలురా! నిజంగా ఈ ఊరువదలి మీరెక్కడికో వెళ్లొద్దు. అలా వెళ్తే మీ అమ్మ కాదు నేను మూగదాన్నవుతాను' అన్నాను ఆనందంగా

వెంటనే 'తథాస్తు' అన్నట్లు గుడిలోని గంటలు నిర్విరామంగా మ్రోగసాగాయ్.